# ఇంతేనా ?

రాధిక నోరి, **Tallahassee, FL**

విమానం దిగి ఎయిర్‌పోర్ట్ లోనికి అడుపెట్టగానే ఒక్కసారి ఒళ్ళంతా పులకరించినట్లయింది హరికి. "అబ్బ ! మళ్ళీ ఎన్నాళ్ళకు ఇండియా వచ్చాను" అనుకున్నాడు సంతోషంగా. ఎయిర్‌పోర్ట్ బయటకు రాగానే తమ్ముళ్ళిద్దరూ కనిపించారు. ఆప్యాయంగా వాళ్ళను కౌగలించుకున్నాడు. ఇంటికి వెళ్తూంటే దారిలో తమ్ముళ్ళను లక్ష ప్రశ్నలు వేస్తున్నాడు. ఎప్పుడెప్పుడు అమ్మ, నాన్నను చూద్దామా అని వుంది. ఇంట్లో అడుగుపెట్టగానే అమ్మ, నాన్నలతోపాటు అత్తగారు, మామగారు కూడా ఎదురు వచ్చారు. కుశల ప్రశ్నలయిన తర్వాత "మా అమ్మాయిని కూడా తీసుకొస్తే బాగుండేది. చూసి చాలా రోజులయింది" అన్నారు మామగారు. "సుమతి వచ్చే ఏడాది వస్తుందండీ. అప్పటికి మా బాబు కూడా కొంచెం పెద్దవాడవుతాడు. మరీ ఇంత చిన్న వయసులో తీసుకొస్తే ఇక్కడ జబ్బు పడతాడేమోనని భయపడ్డాము" అన్నాడు హరి. "ఈ సంవత్సరం ఇల్లుకొని చాలా ఖర్చులో ఉన్నాము. వచ్చే ఏడాది దాకా నేను రావటం వీలుకాదు. మా ఆడపడుచు పెళ్ళికి కూడా మావారు అక్కడ లేరు కాబట్టి ముందుగా ఈ ఏడాది ఆయన ఒక్కరే వస్తారు అంటూ అమ్మాయి ఉత్తరం రాసింది" అన్నది అత్తగారు. అసలు సంగతి నాకు తెలుసులే అన్నట్లు. హరికి ఏం అనాలో తెలీలేదు. "రెండు లక్షలు అప్పుచేసి ఇల్లు కొన్నారటగా! పోనీ ఆ అప్పేదో వచ్చే ఏడాది చేయలేకపోయారా ? అలా చేస్తే ఇప్పుడు అమ్మాయికి నీతో రావటానికి అవకాశం వుండేది" అన్నది అత్తగారు మళ్ళీ. ఎటూ అప్పుచేసి కొన్న ఇల్లే కాబట్టి ఇంకో ఏడాది ఆగినా నష్టం ఏమీ లేదులే అన్న ఆమె ఉద్దేశం స్పష్టంగా తెలిసింది హరికి. "ఇంటి కోసం మీ అమ్మాయే ఎక్కువ తొందర పడిందండీ. నేను కొంచెం ఆగుదామనే అన్నాను. కానీ ఇల్లు కొంటే టాక్స్ బెనిఫిట్స్ వస్తాయని సుమతి చాలా ఆత్రపడింది. ఇంక అప్పు సంగతి అంటారా, ఆ దేశంలో ఇల్లుకొనే పద్ధతి అదే! డబ్బున్న వాళ్ళు కూడా ఎవరూ రెడీ క్యాష్ పెట్టి ఇల్లు కొనరు. ఇంటి మీద, కార్ల మీద ప్రతీ వారికీ అప్పు వుంటుంది" అంటూ విడమరిచి చెప్పాడు. "సుమతీ! ఇల్లు వచ్చే ఏడాది కొందాము. ఈ ఏడాది ఇద్దరం కలిసి ఇండియా వెళదామంటే నా మాట వినలేదు. పోనీ ఖర్చయితే అయింది. ఇల్లు కొన్నా కూడా ఇద్దరమూ కలిసే ఇండియా వెళ్దామంటే దానికీ నువ్వు ఒప్పుకోలేదు. మీ చెల్లెలి పెళ్ళికి కూడా మీరు వెళ్ళలేదు, ముందు మీరొక్కరూ వెళ్ళి రండి, నేను తర్వాత బాబుని తీసుకుని వెళ్తాను అంటూ పట్టుబట్టావు. ఇప్పుడు చూడు, డబ్బు ఖర్చవుతుందన్న భయంతో నిన్ను వదలి నేనొక్కడినే వచ్చిన స్వార్థపరుడిలాగా చూస్తున్నారు మీ వాళ్ళంతా నన్ను" కోపంగా సుమతిని మనసులోనే తిట్టుకున్నాడు హరి. హరి అత్తగారు మనసులో ఏమనుకుందో, పైకి మాత్రం ఏమీ అనలేదు. "అయితే అమెరికాలో స్వంత ఇళ్ళు ఉన్నవారందరికీ అప్పులే అన్నమాట. మీ డాంబికమంతా ఇంతేనా?" అని ఆవిడ ఎగతాళి చేస్తున్నట్లుగా ఆవిడని చూస్తే అనిపించింది హరికి.

భోజనాల దగ్గర హరి చిన్న తమ్ముడు గిరి హుషారుగా అన్నాడు హరితో, "అన్నయ్యా! ఆ మధ్య మా కాలేజీ క్యాంపస్‌కి కొన్ని అమెరికన్ సాఫ్ట్‌వేర్ కన్సల్టెన్సీ కంపెనీల వాళ్ళు వచ్చి ఫైనల్ ఇయర్ స్టూడెంట్స్‌ని కొంతమందిని ఇంటర్వ్యూ చేశారు. నన్ను కూడా సెలక్ట్ చేసుకున్నారు. త్వరలోనే పేపర్ వర్క్ అదీ పంపిస్తామన్నారు. అందుకని ఇంకో 3, 4 నెలల్లో నేను కూడా అమెరికా వచ్చేస్తాను. వాళ్ళే జాబ్ ఇప్పించి గ్రీన్ కార్డ్‌కి స్పాన్సర్ చేస్తారు కాబట్టి నాకు ఇంక ఇమ్మిగ్రేషన్ ప్రాబ్లమ్ కూడా వుండదు" భవిష్యత్తు గురించిన బంగారు కలలు కళ్ళలో మెరుస్తూ వుంటే ఎంతో సంతోషంగా అన్నాడు గిరి. హరి మెచ్చుకోలుగా చూసాడు తమ్ముడివైపు. "మా రోజుల్లో జాబ్ వీసా మీద డైరెక్ట్‌గా అమెరికా వెళ్ళగలగటం అసలు మేము వినలేదు. కానీ ఇప్పుడు రోజులు మారాయి. అమెరికా వెళ్ళిన తర్వాత ఇమ్మిగ్రేషన్ వివరాలన్నీ లాయరు ద్వారా తెలుసుకున్నాడు తను. అది కూడా స్టూడెంట్ వీసాలోంచి గ్రీన్‌కార్డ్ స్టేటస్‌కి మారటానికి ఎన్నో ఏళ్ళు వేచి వుండాల్సి వచ్చింది తనకి. కానీ ఇప్పటి వారికి ఆ ప్రాబ్లమ్ లేదు. అమెరికా రాక ముందే రోజు రోజూ మారే అక్కడి ఇమ్మిగ్రేషన్ వాల్యూతో సహా అన్ని వివరాలూ ముందుగానే వారికి తెలుసు" అనుకున్నాడు మనసులో. ఇంతలో హరి పెద్ద తమ్ముడు శౌరి అన్నాడు. "నేను కూడా అమెరికా రావటానికి ట్రై చేద్దామనుకుంటున్నాను" అని. వింటున్న హరి ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. గిరి విషయం వేరు. అతను బిఎస్సీ కంప్యూటర్స్‌లో చేసి ఇప్పుడు ఎమ్.సి.ఎ. చేస్తున్నాడు. అతని జీవితం ఇప్పుడిప్పుడే మొదలవబోతోంది. కాని శౌరి అలా కాదు. అతను జీవితంలో బాగా సెటిల్ అయ్యాడు. అతను చిన్నప్పటి నుండి లెక్కల్లో వీక్ అనీ బి.కాం. చేశాడు. ఫైనల్ ఎగ్జామ్స్ ముందు ఏవో బ్యాంక్ ఎగ్జామ్స్ రాస్తే అనుకోకుండా సెలక్షన్ వచ్చింది. పరీక్షలయిన వెంటనే జాబ్ లో జాయిన్ అయిపోయాడు. ఆ తర్వాత ప్రమోషన్ కొరకు మళ్ళీ బ్యాంక్ ఎగ్జామ్స్ రాసి ఆఫీసరు కూడా అయ్యాడు. ఈ లోపల ప్రైవేటుగా చదివి ఎం.కామ్ కూడా పాస్ అయ్యాడు. పెళ్ళి కూడా అయింది. ఒక చిన్న కూతురు కూడా. "ఇంత బాగా ఇక్కడ సెటిల్ అయిన తర్వాత ఇవన్నీ వదులుకుని సంసారాన్ని వెంటబెట్టుకుని అక్కడి వచ్చి మళ్ళీ జీవితం మొదలు పెట్టాలనుకోవడం అంత తెలివైన పనా ? అదీగాక వున్న ముగ్గురు కొడుకులూ అక్కడికి వచ్చేస్తే మరి ఇక్కడ అమ్మ, నాన్నలను వారి ముసలి వయసులో చూసేదెవరు?" ఈ ఆలోచనలన్నీ మనసులో మెదిలినా పైకి ధైర్యంగా అడగలేకపోయాడు హరి. ఒకవేళ అడిగినా మరి నువ్వు అమెరికా వెళ్ళాలనుకున్నప్పుడు ఈ సంకోచం ఏమైంది ? అని శౌరి ఎదురు ప్రశ్న వేస్తే ఏం జవాబు చెప్పాలో తెలీలేదు హరికి. అయినా వూరుకోలేక "ఎలా వద్దామనుకుంటున్నావు? స్టూడెంట్‌గానా ? అని అడిగాడు కుతూహలంగా. శౌరి గట్టిగా నవ్వాడు. "నువ్వు ఇంకా ఏ కాలంలో ఉన్నావురా మరీ అంత అమాయకపు ఆలోచనలు చేస్తున్నావు. ఇప్పుడు మళ్ళీ కష్టపడి ఏళ్ళ తరబడి చదివే ఓపిక నాకు లేదు. ఆ మధ్య ఒరేకిల్‌లో ఒక క్రాష్ కోర్సు చేశాను. నాకు తెలిసిన స్నేహితుడొకడు ఒక fake experience certificate ఇప్పిస్తానన్నాడు. అందుకని నేను కూడా గిరిలాగా job visa మీదే వస్తాను" ధీమాగా అన్నాడు శౌరి. "ఎవరైనా నీ knowledge చూసి certificate ఇచ్చేసినంతమాత్రాన సరిపోయిందా? నాలుగైదు నెలలు ఏదో చిన్న కోర్సు చేసి సంపాదించిన ఆ కొద్దిపాటి knowledge రేపు ఆ job నిలబెట్టుకునేందుకు ఎంతవరకు ఉపయోగపడ గలదు అన్న సంగతి ఆలోచించావా ?" ముందు చూపుతో అన్నాడు హరి. శౌరి విసుగ్గా చూసాడు హరి వైపు. ఆ చూపులో "ఇంతేనా నీకు తెలిసింది" అన్న చికాకు కనిపించింది హరికి. "నువ్వు మరీ బెదురు మాటలు మాట్లాడుతున్నావు. ఇప్పుడందరూ అలాగే వెళ్తున్నారు. మరి life లో ఎప్పుడో అప్పుడు ఎక్కడో అక్కడ risk తీసుకోక తప్పదు" అన్నాడు శౌరి మొండిగా. హరికి ఇంకేమీ అనాలనిపించలేదు. అనినా ప్రయోజనం ఏమీ ఉండదనిపించింది.

భోజనాలయిన తర్వాత అందరూ కబుర్లలో పడ్డారు. హరి వచ్చాడని అతని పెద్ద చెల్లెలు శివాని అత్తవారింటి నుండి వచ్చింది. అతన్ని చూడటానికి. ఆమె పెళ్ళికి హరి రాలేకపోయాడు. immigration మధ్యలో ఉండటం వలన. హరి చెల్లెలికోసం తను తీసుకొచ్చిన బహుమతులు తీసాడు బయటికి. అన్నీ చూసిన శివాని మెల్లిగా అంది, "అన్నయ్యా ! ఇవన్నీ సరేలే. నువ్వు నాకోసం ఒక gold coin తీసుకొస్తావనుకున్నాను" అని. హరి ఒక్కసారి తెల్లబోయాడు. "బంగారం తీసుకురావాలంటే నాకు భయమే ! సుమతి కోసం కూడా నేనేమీ బంగారం తీసుకురాలేదు. కావాలంటే ఇక్కడే కొనుక్కోవచ్చు" అన్నాడు మెల్లిగా తను తీసుకొచ్చినవి చెల్లెలికి నచ్చలేదని చిన్నబుచ్చుకున్న స్వరంతో. శివాని గట్టిగా నవ్వింది. "ఇంత భయమేమిటిరా నీకు ? అందరూ తీసుకురావటం

లేదూ? అందరిలాగానే మనమూనూ" అంది ధైర్యంగా, ధీమాగా. ఆమె గొంతులో "ఇంతేనా నీకు తెలిసింది" అన్న భావం మళ్ళీ వినిపించింది హరికి. "అందరి సంగతి నాకు తెలీదు. నాకు మాత్రం భయం" అన్నాడు హరి పిరికిగా.

"అన్నయ్యా ! మన జిమ్మీ కోసం నేను తెమ్మన్న bark belt తెచ్చావా ? గిరి అడిగాడు. హరి ఒక్కసారి బిత్తరబోయాడు. ".... బెల్టా? అదేమిటి ? నేనెప్పుడూ వినలేదే ! ఎప్పుడడిగావు నువ్వు ?" అయోమయంగా అడిగాడు.

"అదేమిటిరా, నీకింత మతిమరుపు ఎప్పటి నుండి వచ్చింది ? కుక్కలు అతిగా అరవకుండా shock ఇచ్చే bark belt తీసుకురమ్మని చెప్పాను కదా" విసుగ్గా అన్నాడు గిరి. అప్పుడప్పుడు జిమ్మీ అరుపులకి విసుక్కుంటూ "దీన్ని ఎక్కడన్నా వదిలేసి రా" అని అమ్మ, నాన్న అన్నప్పుడల్లా "అన్నయ్యచేత ఒక belt తెప్పిస్తున్నాను, అది పెడితే ఇంక దీని అరుపుల బాధ మనకుండదు" అని వాళ్ళకి నచ్చచెపుతూ వస్తున్నాడు. ఇప్పుడింక ఆ ఆశ కూడా పోయింది.

"ఏమో ! నాకు గుర్తులేదు. అయినా మా ఇంట్లో ఏ కుక్కలూ లేవు. ఆ belt ల సంగతి ఏమిటో నాకు తెలీదు. నేను, సుమతి ఉద్యోగాలు చేసుకుంటూ మా బాబు సంగతి చూసుకోవటానికే 24 గంటలు రోజుకి చాలటం లేదు. ఇంక pets సంగతి ఆలోచించటానికి టైమెక్కడ ఉంది ?" అన్నాడు హరి.

"ఒక్కడ ఉన్న నాకే ఈ సంగతులన్నీ తెలుసు. అమెరికాలో ఉండి కూడా నీకు తెలీదా ? ఇంతేనా ?" అని అడుగుతున్నట్లుగా గిరి తన వైపు చూసినప్పుడు అనిపించింది హరికి.

"హరీ ! మన కూరలు, పళ్ళు అన్నీ దొరుకుతాయా మీ ఊళ్ళో" తండ్రి కుతూహలంగా అడిగితే ఆ వివరాలన్నీ చెప్పటం మొదలెట్టాడు హరి. ప్రతిదాని ధర అడిగి తెలుసుకుని దాన్ని డాలర్లలోంచి రూపాయల్లోకి మార్చుకుని "అమ్మో ! ఇంత ఖరీదా" అని అందరూ ఆశ్చర్యపోతూంటే" అలా లెక్కలు వేయకండి. డాలర్లని రూపాయల్లోకి మారిస్తే value లో తేడా కానీ లేకపోతే ఒక డాలరుని ఒక రూపాయిలాగానే చూడాలి" అంటూ వాళ్ళకి విడమరిచి చెప్పాడు. "మరి అలా అయితే, food అంత cheap అయితే ఇంక మిగిలిన ఖర్చులు పెద్దగా ఏముంటాయి ? ఏమి మిగలదంటారు మీరు" అని అడిగింది అత్తగారు. అల్లుడు దుబారాపరుడేమో, తమ దగ్గర మాత్రమే పొదుపు నటిస్తున్నాడేమోనని ఆవిడ అనుమానం.

"food ఒక్కటే cheap అండీ, కార్లు, ఇళ్ళు ఇలా మిగిలినవన్నీ ఖరీదే ! వీటికి తోడు రకరకాల insuranceలు. వీటికి ఎక్కడ లేని ఖర్చు అవుతుంది", అన్నాడు హరి. కానీ అతని మాటలేవీ వాళ్ళ బుర్రల్లోకి ఎక్కినట్లు అతనికి అనిపించలేదు. వాళ్ళ చూపులు ఇంకా అనుమానంగా, ప్రశ్నార్థకంగానే వున్నాయి.

ఇంతలో హరి దృష్టి చిన్న చెల్లెలు భవాని మీద పడింది. "భవానికి ఆమధ్య ఏదో సంబంధం కుదిరేట్లుగా వుందని వుత్తరం రాసారు. ఏమైంది అ విషయం ?" అని అడిగాడు. కొద్దిసేపు అందరూ మౌనం వహించారు. తర్వాత మెల్లిగా తల్లి అంది, "దాన్నే అడగరా, వాళ్ళు చాలా మోజు పడుతున్నారు మన సంబంధం అంటే. ఆ అబ్బాయి కూడా దీన్ని చాలా ఇష్ట పడ్డాడు. మనమ్మాయే వెనక్కు లాగుతోంది" ఆవిడ గొంతులో అసంతృప్తి స్పష్టంగా తెలుస్తోంది.

"అదేమిటి ? మంచి కుటుంబం, అబ్బాయి బుద్ధిమంతుడు, చదువుకున్నవాడు, బ్యాంక్‌లో పెద్ద ఆఫీసరు, బాగా సంపాదిస్తున్నాడు. ఇంకా ఇంతకన్నా ఏం కావాలి ? కట్నం ఎంత కావాలన్నా డబ్బు నేనిస్తాను" అన్నాడు హరి. భవాని ఎందుకు వద్దంటున్నదో అర్థం కాలేదు అతనికి. "అమెరికా సంబంధం అయితే తప్ప చేసుకోదుట" అందరూ మళ్ళీ మౌనం వహిస్తే చివరికి తల్లి మెల్లిగా అంది. భవాని కోపంగా చూసింది తల్లి వంక 'నా రహస్యం చెప్పేశావా' అన్నట్లుగా.

"మధ్య వాళ్ళ ఫ్రెండ్‌ని న్యూయార్క్‌లో ఉన్న వాళ్ళ బావ పెళ్ళి చేసుకుని తీసికెళ్ళినప్పటినుండి దీనికి కూడా బాగా ఎక్కింది అమెరికా పిచ్చి" నవ్వుతూ ఏడిపించాడు భవానిని గిరి.

"నువ్వు నోరు మూసుకోరా. నువ్వేమన్నా తక్కువ తిన్నావా? రోజూ కాలేజ్ నుండి రాగానే ఆ అమెరికా కంపెనీలు, ఈ అమెరికా ఉద్యోగాలు. ఆ వీసాలు ఈ జీతాలు అంటూ నీక్కూడా ఎప్పుడూ అదేగా గోల ! దీనికి తోడు ఈ మధ్య శౌరి కూడా మొదలెట్టాడు అమెరికా వెళ్తానంటూ. ఇలా ఇంకో విషయం అంటూ లేకుండా ఇంట్లో అస్తమానమూ అమెరికా జపమే చేస్తూ ఉంటే దాని బుర్రలోనికి కూడా ఆ పిచ్చి ఎక్కక ఇంకేమవుతుంది?" తల్లి గిరిని గదమాయిస్తూ అంది. అక్కడున్న అందరూ పకపకా నవ్వారు. తనని సమర్థిస్తున్నారో లేక నెపం ఎంచుతున్నారో తెలీని భవాని బుంగమూతి పెట్టింది.

"భవానీ ! అమెరికా, అమెరికా అంటూ అంత ఉబలాటపడుతున్నావు. అక్కడ ఎంత కష్టపడాలో తెలుసా? పనిమనుషులెవరూ ఉండరు. అన్ని పనులూ మనమే చేసుకోవాలి. ఇక్కడ అమ్మచేత, వదిన చేత సేవలు చేయించుకున్నట్లుగా అక్కడ ఎవరూ ఉండరు నిన్ను కనిపెట్టి నీ అవసరాలు తీర్చటానికి, డబ్బుకనక ఉంటే ఇండియాలో ఉన్న సుఖం ఇంకెక్కడా లేదు. నా మాట నమ్ము" అన్నాడు హరి.

అతను వచ్చినప్పటినుండీ గమనిస్తున్నాడు, భవాని ఇంట్లో పని కొంచెం కూడా చేయటం లేదు. మాటిమాటికీ అమ్మా, వదినా అంటూ వాళ్ళని పిలుస్తోంది. "పాపం సుమతి, ఒక్క నిముషం కూడా ఖాళీగా ఉండదు. ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూనే ఉంటుంది. బాబు పుట్టిన తర్వాత ఈ పని ఒత్తిడి ఇంకా ఎక్కువైంది" అనుకున్నాడు భార్య గుర్తు వచ్చి. సుమతి పట్ల ప్రేమ, జాలితో హరి మనసు నిండిపోయింది. "ఆ విషయాలన్నీ నాకు తెలుసు. నా ఫ్రెండ్ చెప్పింది. అక్కడ పని చేయటానికి ఎవరి సహాయమూ ఉండకపోయినా పని చేయటం ఏమీ కష్టంగా అనిపించదుట. మెషీన్ల సాయంతో చిటికెలో పనంతా చేసెయ్యొచ్చుట" అన్నీ తెలిసిన ఆరిందాలా వెంటనే అంది భవాని. "అక్కడి వివరాలు నీకన్నా నాకు ఎక్కువే తెలుసులే ' అన్న ధీమా, "అంత ఏమీ తెలియకుండా మాట్లాడతానా ? నా గురించి నీకింతేనా తెలిసింది" అన్న ఎగతాళి ఆమె గొంతులో వినిపించాయి హరికి. "ఇలా అందరి ముందూ కాదు. ఒంటరిగా, personal గా మాట్లాడాలి భవానితో ' అనుకున్నాడు హరి మనసులో.

ఒకరోజు హరి సినిమాకి వెళదామని తయారవుతున్నాడు హడావిడిగా. అప్పటికే ఆలస్యం అవుతోంది. ఇంతలో వాళ్ళ మామగారు వచ్చారు. "హరీ ! మా ఊళ్ళో భజన మందిర నిర్మాణానికి నీ తరపునుండి వంద డాలర్లు డొనేషన్ ఇస్తానని మాటిచ్చాను వాళ్ళకి" అన్నారు. హరికి ఏమనాలో తెలీలేదు. సుమతి, తను డబ్బు ఖర్చు పెట్టే విషయంలో ఎంత జాగ్రత్తగా వుంటారో, ఏ ఛారిటీకన్నా డబ్బు డొనేట్ చేసేముందు ఎంత ఆలోచిస్తారో గుర్తొచ్చింది అతనికి. అంతడబ్బు ఇవ్వాలని లేదు. అయినా ఆ విషయం మామగారికి ఎలా చెప్పాలో తెలియక మౌనంగా వంద డాలర్లకు చెక్కు రాసిచ్చాడు. చెక్కు అందుకుంటూ ఆయన "అయినా వంద డాలర్లంటే మీకెంతలే! వంద రూపాయల్లాగానేగా!" అన్నాడు యథాలాపంగా, వెంటనే హరి ఇంక ఉండలేక "కానీ ఆ భజనం మందిరం వాళ్ళకి అది మూడువేల ఆరువందలు. It is a lot of money for them" అన్నాడు అక్కసుగా. వెంటనే హరి మామగారు అతనివైపు చురుక్కున చూశారు. "ఇంతేనా నీ దానగుణం?" అని ఆయన తన చూపులతో గేలి చేస్తున్నట్లుగా అనిపించి హరి చటుక్కున తన చూపులు మరల్చుకున్నాడు. ఇంక సినిమాహాలు దగ్గర జనాన్ని చూసి హరి ఆశ్చర్యానికి అంతులేదు. "ఎక్కడి నుండి వస్తున్నారు ఈ జనం అంతా ? ఇదివరకటికంటే ఇప్పుడు ఇండియా జనాభా బాగా పెరిగినట్లుంది. అయినా ఇప్పుడు చాలామంది ఇళ్ళల్లో VCR లు ఉన్నాయి. అయినా ఈ సినిమాహాళ్ళ దగ్గర ఇంత రద్దీ ఎందుకో ? అనుకుంటూ ఆశ్చర్యపోయాడు. అదేమాట శౌరితో అంటే "భలేవాడివిరా ! ఇంట్లో ...VCR. లో చూసినదానికీ, థియేటర్‌లో చూసినదానికీ తేడా లేదూ? థియేటర్‌లో సినిమా చూసి చాలా ఏళ్ళవటం వలన ఆ థ్రిల్ నువ్వు మర్చిపోయి ఉంటావు

అన్నాడు శౌరి. "సినిమా గురించి ఇంతేనా నీకు గుర్తున్నది" అని శౌరి నవ్వినట్లుగా అనిపించింది హరికి. "మా ఊళ్ళో కూడా మన సినిమాలు థియేటర్‌లో చూపిస్తారు. చూడటానికి టైము దొరకక నేను, సుమతి వెళ్ళం. అంతే" అన్నాడు హరి నన్ను మరీ అంత తెలియనివాడిలా అంచనా వేయకు అన్న అర్థం వచ్చేలాగా.

ఒకరోజు శివాని వాళ్ళాయనకు ఏదో పెద్ద ప్రమోషను వచ్చిందని అందరినీ పార్టీకి పిలిచారు. ఏదో పెద్ద హోటల్‌లో పెద్ద పార్టీ ఇచ్చారు అందరికీ ఆ ఏర్పాట్లు, పెళ్ళిలాగా ఆ హడివిడి చూసి హరి ఆశ్చర్యపోయాడు. "ఇంత ఆర్భాటంగా చేస్తున్నారు. చాలా ఖర్చు అయివుంటుంది" అనుకున్నాడు. తమ బాబు మొదటి పుట్టినరోజు పార్టీకి తను క్యాటరింగ్‌కి ఇద్దామని ఎంత చెప్పినా అనవసరంగా అంత ఖర్చు ఎందుకని సుమతి అందరికీ ఎంత కష్టపడి వంటలు చేసిందో గుర్తువచ్చింది. "ఇక్కడి వాళ్ళేనయం. ఖర్చుని లెక్క చేయకుండా లైఫ్‌ని చక్కగా ఎంజాయ్ చేస్తున్నారు" అనుకున్నాడు. ఇంటికి వచ్చిన తర్వాత అదే మాట తల్లితో అంటే "ఇప్పుడందరూ అలాగే చేస్తున్నార్రా! పెళ్ళిళ్ళు, birthday లు, anniversary లు ఎవరూ ఇళ్ళల్లో చెయ్యటంలేదు. Hotels లోనే చేస్తున్నారు. ఖర్చు అయినా సుఖం ఉంటోంది" అంది తల్లి.

"ఖర్చు సంగతి ఒక్కటే కాదమ్మా ! ఎంత waste అవుతోందో ఎవరూ గుర్తించటంలేదు. నా పక్కన కూర్చున్న వాళ్ళందరూ plate లో సగం పైగా తినకుండా వదిలేశారు. food కి విలువ లేకుండా పోయింది" బాధగా అన్నాడు హరి. తాము leftover లు దాచుకుని ఎలా తింటామో గుర్తొచ్చింది. "ఇలాంటి functions లో ఆ మాత్రం అన్నా waste కాకుండా ఎలా ఉంటుంది" అన్నది శౌరి భార్య. "ఇంత మామూలు విషయం కూడా నీకు తెలీదా ? అయినా ఇంత పొదుపు ఎప్పటి నుండి నేర్చుకున్నావు" అన్నట్లుగా అనిపించింది హరికి.

ఇంకోరోజు భవాని ఏదో స్వెట్టరు కొనుక్కుని హరికి చూపించింది. "అన్నయ్యా! నువ్వు తెచ్చిన దానికంటే ఇది ఎంత heavy గా వుందో చూడు" అంది. "నిజమే కానీ ఇంత heavy స్వెట్టరు అవసరం ఇక్కడి ఎండల్లో ఏముంది ? లేక ఇది కూడా నీ భవిష్యత్తులో రానున్న అమెరికా కాపురం కోసమా ?" అన్నాడు హరి హాస్యంగా. దాని ఖరీదు తెలుసుకుని "season మారేదాకా ఆగలేకపోయావా ? ఇప్పుడు ఆ స్వెటరుకి తొందరేమొచ్చింది ? వేరే స్వెట్టర్లు ఇంకా చాలా వున్నాయిగా నీకు ? off season అయితే ధరలు తగ్గుతాయి కదూ !" అని హరి అంటే, "నిజమేననుకో, కానీ అంత దాకా ఎవరాగుతారు ? ఈ స్టైల్ మళ్ళీ వుంటుందో లేదో" అంది చాలా తేలికగా భవాని. తను, సుమతి sales కోసం ఎలా ఎదురుచూస్తారో, ఏ వస్తువైనా sale ఉన్నప్పుడే కొనాలని ఎలా ఆరాటపడతారో గుర్తు వచ్చింది హరికి.

ఒకరోజు సుమతి కోసం ఏదో షాపింగు చేద్దామని భవానిని తీసుకుని బజారు వెళ్ళాడు హరి. ఇంటికి వచ్చిన తర్వాత భవాని హరిని ఎంతో వేళాకోళం చేసింది. "అమ్మా ! అన్నయ్య అమెరికా వెళ్ళిన తర్వాత ఎంత పిసినారిగా మారాడో చెప్పలేను. వదినకి ఒక పట్టుచీర కొనిపించటానికి నా తాతలు దిగి వచ్చారు" అని తల్లితో ఫిర్యాదు చేసింది. "పదిహేను వేలు పెట్టి ఒక్క పట్టుచీర కొనమంటుంది. అమ్మా ! అప్పుడప్పుడు కాస్సేపటికోసం కట్టుకునే చీరకు అంత ధరేమిటి ? దాన్ని సుమతి పదిహేను సార్లన్నా కట్టుకుంటుందో లేదో ? అయినా ఈ చీరలు, నగల ధరలు ఇంత పెరిగిపోయాయేమిటి ? పదిహేను వేలంటే అంత తేలికగా ఉందా ? డబ్బుకి విలువ ఇంతగా పడిపోయిందా ? ఒక మధ్యతరగతి కుటుంబీకుడు ఈ ధరలకి ఎలా తట్టుకోగలడు ?"ఆవేశంగా అన్నాడు హరి.

"అబ్బో, అక్కడ ఉన్న వాళ్ళందరూ మధ్య తరగతి వాళ్ళు కాక మిలియనీర్లు అనుకుంటున్నావా ? అసలు నువ్వు అమెరికా వెళ్ళి చాలా మారిపోయావు. డాలర్ల సంపాదన మొదలైన కొద్దీ పిసినారితనం ఎక్కువైంది నీకు" అంది ఎక్కిరింపుగా భవాని.

"అదుగో, మాట్లాడితే అమెరికా అంటావేమిటి ? అమెరికాలో వున్నవాళ్ళందరూ Bill gates లాగానో Donald Trump లాగానో ధనవంతులనా నీ ఉద్దేశం ? అసలు అక్కడ మేమందరం ఎంత కష్టపడి డబ్బు దాచుకుంటామో నీకు తెలుసా ? ఏదో డాలర్లని రూపాయల్లోకి మార్చుకుని ఈ మాత్రం ఖర్చు పెట్టగలుగుతున్నాము కానీ ఇంత విచ్చలవిడిగా మేము అస్సలు ఖర్చు పెట్టం. అక్కడ మాకున్న సుఖాలన్నీ మేము కష్టపడి సంపాదించుకున్నవి. ఇక్కడలాగా ఇతరులు సంపాదించి చేతికందించినవి కాదు. అందుకే మాకు డబ్బు విలువ బాగా తెలుసు. కానీ అక్కడి వారి గురించి, అక్కడి life గురించి మాత్రం మీకందరికీ చాలా wrong perception ఉంది" అన్నాడు హరి ఆవేశంగా, కోపంగా. అతను India లో అడుగు పెట్టినది మొదలు ఇప్పటిదాకా ప్రతీవాళ్ళూ ఏం మాట్లాడినా "ఇంతేనా నీకు తెలిసింది" అన్నట్లుగా treat చేయటం, అతన్ని చిన్న చూపు చూడటం గుర్తు వచ్చి అతని ఆవేశం ఎక్కువైంది. భవాని మళ్ళీ ఏదన్నా అనేదేమో ! కానీ ఇంతలో "ఇంక వూరుకోండర్రా ! మీరు, మీ పోట్లాటలూను. మరీ చిన్న పిల్లలవుతున్నారు" అంటూ తల్లి ఇద్దరికీ చెప్పేసింది.

"సుమతీ ! India మనం ఇదివరకు చూసినప్పటిలాగా లేదు. ఇక్కడి పరిస్థితులు చాలా మారిపోయాయి. మనుష్యులు అంతకంటే మారిపోయారు. India నుండి అమెరికా వెళ్ళిన వారికి ఏదో culture shock వస్తుందంటారు. అలాంటి shock ఏదీ నాకు అప్పుడు రాలేదు. కానీ అంతకు మించిన shock ఏదో నా స్వంత దేశంలో, నా స్వంత కుటుంబంలో నాకిప్పుడు కలుగుతోంది. మరి దీనికి నేనే overeact అవుతున్నానో, లేక ఇది సహజమైన రియాక్షనేమో నాకు తెలీటంలేదు. It is totally unbelievable" అయోమయంగా తన మనసులోని బాధను, తికమకను దూరాన వున్న భార్యతో మౌనంగా చెప్పుకున్నాడు హరి.

## గరికపూలు (ముగింపు)

నాకు కూడ దక్కిందని సంతోషిస్తూ... దాగిన చోటునుండి కదిలాను నేనూ నెమ్మదిగా... ఒకటే దారి ముందు వేరే ఏదీ కన్పించటంలేదు. చిత్రంగా ఉంది... ఆమె నేను వెళ్ళవలసిన దారిలోనే వెళ్ళింది. వెళ్ళి వెళ్ళి ఒక ఇంటి ముందు ఆగిపోయింది భూలోకంలో. నేను నిశ్చేష్టురాలినైపోయాను. అది మా ఇల్లే ఆమె ఇక్కడికి ఎందుకు వచ్చింది ? నేను తనను దేవితో చూశానని పసిగట్టి అడగటానికి వచ్చిందా? ఆలోచిస్తూనే అడుగు ముందుకు వేశాను. ఆమె వెనుకకు తిరిగి చిన్నగా నవ్వింది..... నిజంగా నాకళ్ళకేదో అయినట్లుంది ఎదురుగా ఉన్నది నా ప్రతిబింబంలా, కవలలో ఒకరిగా కన్పించిందామె. ఎవరివి నీవు అని ప్రశ్నించే లోపలే... అడుగులు ముందుకు వేసింది. నోరు తెరిచే లోపలే నాతో పలికి వెళ్ళిపోయినట్లనిపించింది. నవ్వుతూ... నాలోపలికి వెళ్ళిపోయినట్లనిపించింది. నవ్వుతూ... మాటలు రాక అలా చూస్తూ నిలిచిపోయాను. ఎదురుగా చేతిలో ఉన్న పూలను చూస్తూ పరిమళాలు చిందే ప్రసూనాలను... వింత భావంతో దేహం గగుర్పొడిచింది. ఇంతకూ ఏమిటిది ? కలా నిజమా ? ఆమే నేను ! నేనే ఆమె ! నాలో ఒక భాగం నన్ను వదిలి చదువుల తల్లి దగ్గరకు వెళ్ళి అడగవలసినవి అడిగి ఆ తల్లి ఆశీస్సులు పొంది.. మరల నాలో కలిసిపోయిందా? అయితే అదృష్టవంతురాలే... అంతసేపూ ఆ తల్లి ఎదుట ఉన్నది నాలోని భాగమే... నేనే.

కనులు మూసుకొని దేవిని తలచుకొన్నాను తృప్తిగా .. సరస్వతితో సంభాషణ గుర్తు తెచ్చుకుంటూ..